క్లుప్తంగా

రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

యల్లనూరు: వజ్రకరూరు మండలం కొనకొండ్ల హైస్కూల్‌లో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీల్లో తిమ్మంపల్లి హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటినట్లు ప్రధానోపాధ్యాయుడు గోపాల్‌రెడ్డి తెలిపారు. అండర్-14, అండర్-17 విభాగాల్లో ఆరుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపికయ్యారన్నారు. అండర్-14లో రాజేశ్వరి, పవిత్ర, యశ్వంత్‌రెడ్డి, అండర్-17 విభాగంలో ఎంపికైన లావణ్య, చంద్రిక, లక్ష్మీదీపక్‌ను సోమవారం అభినందించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు బాల మధుసూదన్‌రెడ్డిని పలువురు అభినందించారు.

మహిళా సంరక్షణ కార్యదర్శికి మెమో

పామిడి: మండలంలోని కండ్లపల్లి గ్రామ సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శి, బీఎల్‌ఓ సాయికృపకు మెమో జారీ చేసినట్లు తహసీల్దార్ ఆర్వీ సునితబాయి సోమవారం తెలిపారు. గత ఆదివారం సారకాయలపేటలో జరిగిన ఓటరు నమోదుకు సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శి సాయికృప హాజరు కాలేదన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు నివేదించినట్లు పేర్కొన్నారు. ప్రతి బీఎల్‌ఓ ఓటరు నమోదు ప్రక్రియలో జియో ట్యాగింగ్ తప్పక చేపట్టాలన్నారు. నిర్లక్ష్యం వహించే బీఎల్‌ఓలపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

బీకేఎస్‌లో స్కూటర్ యాత్ర



ర్యాలీ ప్రారంభిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలో సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో స్కూటర్ యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ మాట్లాడుతూ.. రాష్ట్ర విభజన తరువాత ఆంధ్రప్రదేశ్ పారిశ్రామికంగా వ్యవసాయ రంగంలో వెనుకబడిందన్నారు. జిల్లా అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. ప్రజా సమస్యలపై స్కూటర్ యాత్ర ర్యాలీ చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు నల్లప్ప, మండల కార్యదర్శి కుళ్లాయప్ప, పుల్లయ్య, నాగేంద్ర, నాగలింగ తదితరులు పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న మజ్దూర్ యూనియన్ నాయకులు

గుత్తి: ఇటీవల జరిగిన సికింద్రాబాద్ రైల్వే క్రెడిట్ సొసైటీ ఎన్నికల్లో గుత్తికి చెందిన దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు దాదా ఖలందర్, నాయబ్ రసూల్, శివకృష్ణ, రితేష్ కుమార్ డెలిగేట్స్‌గా విజయం సాధించారు. ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని సోమవారం సాయంత్రం మజ్దూర్ యూనియన్ నాయకులు, కార్మికులు గెలుపొందిన డెలిగేట్స్‌ను ఊరేగించారు. మజ్దూర్ యూనియన్ డివిజనల్ సెక్రెటరీ విజయకుమార్ మాట్లాడుతూ.. గుంతకల్లు డివిజన్‌లోని 28 డెలిగేట్ల పోస్టులను మజ్దూర్ యూనియన్ క్లీన్ స్వీప్ చేసి గెలుపొందిందన్నారు. గతంలో జరిగిన ఎన్నికల్లో కూడా మజ్దూర్ యూనియన్ ప్యానలే విజయం సాధించిందన్నారు. కార్యక్రమలో మజ్దూర్ యూనియన్ డివిజనల్ కోశాధికారి శర్మ, ఏడీఎస్ నారాయణ, గుంతకల్లు, గుత్తి బ్రాంచ్ సెక్రెటరీలు రమణ, రామాంజులరెడ్డి, శేఖర్ బాబు, సుధీర్, రాజేంద్ర ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



నారాయణ స్వామి (ఫైల్)

యాడికి: మిద్దె పైనుంచి జారి పడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండలంలోని ఓబుళాపురంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ గురు ప్రసాద్ రెడ్డి, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రైతు నారాయణ స్వామి (57 ఆదివారం సాయంత్రం వర్షం కురుస్తుండటంతో నిచ్చెన ఎక్కి గవాక్షి మూత వేశాడు. కిందికి దిగుతున్న క్రమంలో కిందపడటంతో తలకు బలమైన గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అనంతపురం తరలించగా.. పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు.

ఏడుగురి బైండోవర్

తాడిపత్రిటౌన్: పెద్ద పోలమడ గ్రామానికి చెందిన ఏడుగురిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గౌస్ మహ్మమద్ తెలిపారు. అక్రమంగా మద్యం అమ్మకాలు చేస్తున్నారన్న అనుమానంతో వారిపై కేసులు నమోదు చేశామన్నారు. అనంతరం వారిని తహసీల్దార్ అలెగ్జాండర్ ఎదుట హాజరుపరిచారు. రూ.50 వేల వ్యక్తిగత పూచికత్తుపై వదిలిపెట్టినట్లు తెలిపారు.

జగనన్నకు అండగా నిలవాలి

- గడప, గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి



గార్లదిన్నె మండలం కోటంకలో పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

గార్లదిన్నె: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని కోటంకలో గడప, గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. తొలుత కోటంక కొండల్లో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని ఎమ్మెల్యే దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. సంక్షేమ పథకాలు అందుతున్న తీరు, ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే చెప్పాలంటూ లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అవినీతికి తావులేకుండా సంక్షేమ ఫలాలు అందుతున్నాయని పలువురు లబ్ధిదారులు ఎమ్మెల్యే ఎదుట సంతోషం వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాల ద్వారా దాదాపు రూ.4.94 లక్షల లబ్ధి పొందినట్లు లబ్ధిదారురాలు సూజాత సంతోషం వ్యక్తం చేసింది. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల్లో సమస్యల పరిష్కారం కోసమే గడప, గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టామన్నారు. గ్రామంలో సొంత నిధులతో కాలువ తవ్వించి చెరువుకు నీరు అందించినట్లు పేర్కొన్నారు. నవరత్నాలతో ప్రతి ఇంటికి ఆర్థిక భరోసా ఇస్తూ సీఎం జగన్ పరిపాలన సాగిస్తున్నారని కొనియాడారు. రాష్ట్రాభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. గత నాలుగేళ్లుగా సంక్షేమ పథకాలతో పేద, మధ్యతరగతి కుటుంబాల ఆర్థిక పరిస్థితి మెరుగుపడిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరేంద్రరెడ్డి, ఎంపీపీ వెంకటనారాయణ, ఆలయ కమిటీ చైర్మన్ సుబ్బిరెడ్డి, పాలిఏకరి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పరంధామ, జంబులదిన్నె సొసైటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీ అంజలి, లింగప్ప, తాతిరెడ్డి, రామలింగారెడ్డి, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రూ.కోటితో రక్షణ గోడ నిర్మాణం

గార్లదిన్నె: మండల పరిధిలోని కోటంక కొండల్లో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయం వద్ద రక్షణ గోడ నిర్మాణానికి ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ సుబ్బిరెడ్డి మాట్లాడుతూ.. ఆలయం వద్ద ప్రధాన రక్షణ గోడ కూలిపోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక సమస్యను ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. వారు వెంటనే స్పందించి రక్షణ గోడ నిర్మాణానికి దాదాపు రూ.కోటి నిధులు మంజూరు చేయించారని పేర్కొన్నారు. త్వరలోనే పనులను ప్రారంభించి, 35 అడుగుల వెడల్పుతో రక్షణ గోడ నిర్మాణ పనులు పూర్తి చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నరేంద్ర రెడ్డి, ఎంపీపీ వెంకటనారాయణ, సుబ్బిరెడ్డి, తాతిరెడ్డి, రామలింగారెడ్డి, జంబులదిన్నె సొసైటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి, పాలిఏకరి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పరంధామ, లింగప్ప, ఆలయ ఈఓ బాబు పాల్గొన్నారు.

జగదీష్ కుటుంబానికి ప్రభుత్వ అండ..



జగదీష్ భార్యకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని హైస్కూల్ కొట్టాలకు చెందిన జగదీష్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో అతడి అవయవాలను కుటుంబ సభ్యులు దానం చేసిన విషయం తెలిసిందే. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.5 లక్షల చెక్కును సోమవారం ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అందజేశారు. నియోజకవర్గంలో నిరుపేద కుటుంబాలను ఆదుకునేందుకు ఎల్లవేళలా ముందు ఉంటామని తెలిపారు. కాగా.. ప్రమాదం జరిగిన రోజు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి తన సొంత నిధులు రూ.50 వేలను బాధిత కుటుంబానికి అందజేశారు. అంతేకాకుండా బాధిత కుటుంబానికి గతంలో ఇచ్చిన హామీ ప్రకారం జగదీష్ భార్యకు మినీ అంగన్‌వాడీ వర్కర్ ఉద్యోగం ఇప్పించారు. కార్యక్రమంలో బీకేఎస్ వైఎస్సార్‌సీపీ నాయకులు పూల నారాయణస్వామి, పూల రవి, యూత్ మండల కన్వీనర్ రంగనాథ్, అనిల్ కుమార్, గోపాల్, పాల్గొన్నారు.

‘ప్రజా సంకల్ప యాత్ర’ చరిత్రాత్మకం



తాడిపత్రిలోని వైఎస్సార్ సర్కిల్‌లో కేక్ కట్ చేస్తున్న నాయకులు



గుత్తిలో సంబరాలు చేసుకుంటున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు

తాడిపత్రి అర్బన్: రాష్ట్ర ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకునేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప యాత్రకు నేటితో 6 సంవత్సరాలు పూర్తయాయి. సోమవారం సాయంత్రం పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్‌లో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు జావిద్‌ఖాద్రీ తదితర నాయకులు మహానేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు పంచి పెట్టారు. పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీలను నెరవేర్చి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందని పట్టణాధ్యక్షుడు జావిద్‌ఖాద్రీ అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు డీవీ కుమార్, విద్యార్థి విభాగం పట్టణాధ్యక్షుడు మనోజ్, జబీన్, బాబా, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

గుత్తి: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప యాత్రకు ఆరేళ్లు పూర్తికావడంతో సోమవారం పట్టణంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. కేక్ కట్ చేసి, జై జగన్, జైజై జగన్ అంటూ నినాదాలు చేశారు. వైఎస్ జగన్ చేపట్టిన ప్రజా సంకల్ప పాదయాత్ర చరిత్రలో ఒక అరుదైన ఘట్టమన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూర్‌బీ, పట్టణ కన్వీనర్ పీరా, మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ రంగస్వామి, కౌన్సిలర్లు వాల్మీకి శివ, వరదరాజులు, కేవీ రమణ, నరేష్, సీనియర్ నాయకులు సీవీ రంగారెడ్డి, చెన్నాజీ, షఫి, గద్దల నాగరాజు, అరటి పండ్ల చంద్ర, సునీల్, ఓబుళయ్య, శివ, వెల్డింగ్ రవూఫ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



పథకాల లబ్ధిని వివరిస్తున్న చైర్‌పర్సన్ భవాని, వైస్ చైర్‌పర్సన్లు నైరుతి, మైమూన్

గుంతకల్లుటౌన్: ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, వైస్ చైర్‌పర్సన్లు నైరుతిరెడ్డి, మైమూన్ తెలిపారు. సోమవారం పట్టణంలోని 1వ వార్డు, మారుతీ నగర్, సత్యనారాయణ పేట, వాల్మీకి నగర్‌లో కౌన్సిలర్ ఉడదాల ప్రభాకర్ ఆధ్వర్యంలో వారు గడప గడపకూ వెళ్లి గడిచిన నాలుగున్నరేళ్లల్లో జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలపై ఆరా తీశారు. పలు కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టులు, వీధిదీపాల ఏర్పాటు చేయించాలని ప్రజలు కోరారు. నిర్ణీత వ్యవధిలోగా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వార్డు సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా మెరుగైన పాలన అందిస్తున్నారన్నారు. సీఎం జగన్ సహకారంతో గుంతకల్లు నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టిన ఘనత ఎమ్మెల్యే వైవీఆర్‌కే దక్కుతుందన్నారు. ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు యథావిధిగా కొనసాగాలన్నా, సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలన్నా మళ్లీ జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఎన్.రామలింగప్ప, పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకప్ప, 1వ వార్డు ముఖ్య నాయకులు పెద్ద పెద్దన్న, ఉడదాల మస్తాన్, ప్రతాప్, నాగేంద్ర కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు



బాణాసంచా విక్రయదారులకు సూచనలిస్తున్న తహసీల్దార్ బాలమ్మ

యాడికి: నిబంధనల మేరకు బాణాసంచా విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసుకోవాలని తహసీల్దార్ బాలమ్మ సూచించారు. మండల వ్యాప్తంగా మొత్తం 8 బాణాసంచా దుకాణాల ఏర్పాటుకు అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. మండల కేంద్రంలోని పాఠశాల ఎదురుగా 6, రాయలచెరువులో 2 దుకాణాలు ఏర్పాటు చేస్తున్న ప్రదేశాలను సోమవారం అధికారులతో కలసి పరిశీలించారు. యాడికిలో బాణాసంచా విక్రయ కేంద్రాలకు అనుమతించిన ప్రదేశంలో ఉన్న కంపచెట్లను తొలగించుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా దుకాణాల వద్ద ఇసుక, నీరు సిద్ధంగా ఉంచుకోవాలని తాడిపత్రి అగ్నిమాపక అధికారి మోహన్ బాబు తెలిపారు. లైసెన్స్ లేకుండా దీపావళి సామగ్రి విక్రయిస్తే పోలీసుల దృష్టికి తీసుకురావాలని ఏఎస్‌ఐ రామాంజనేయులు సూచించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ సుంకన్న, ఆర్‌ఐ ఆనందబాబు తదితరులు పాల్గొన్నారు.

అధైర్య పడకండి.. న్యాయం చేస్తాం

గుత్తి: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీని సోమవారం గుంతకల్లు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతి రెడ్డి సందర్శించారు. వారం రోజులుగా కాలేజీలో జరుగుతున్న సంఘటనలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె అధ్యాపకులు, విద్యార్థులతో వేర్వేరు సమావేశమై ప్రిన్సిపాల్ వేధింపులపై ఆరా తీశారు. తమను ప్రిన్సిపాల్ సంజీత్ నాయక్ అకారణంగా వేధిస్తున్నారంటూ అధ్యాపకులు, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన నైరుతి రెడ్డి.. మీకు న్యాయం చేస్తామన్నారు. చట్టం, నిబంధనల ప్రకారం ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకునేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వరదరాజులు, నరేష్, కేవీ రమణ, సీనియర్ నాయకులు లాలు నాయక్, గద్దల నాగరాజు, రాము, సునీల్, అరటి పండ్ల చంద్ర, రామాంజి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వెంకట నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం ‘సీఎం సహాయనిధి’



సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేస్తున్న యువనేత సాయిప్రతాప్ రెడ్డి



వలంటీర్ తల్లి నాగేశ్వరమ్మకు రూ.5 లక్షల చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే పద్మావతి

తాడిపత్రిటౌన్: మండలంలోని చిన్నపడమల బ్రాహ్మణపల్లి, బోడాయిపల్లి సజ్జలదిన్నె గ్రామాలకు చెందిన పలువురికి ప్రభుత్వం నుంచి మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే తనయుడు, యువనేత కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి సోమవారం పంపిణీ చేశారు. దాదాపు రూ.4.50 లక్షల విలువైన చెక్కులను బాధితుల ఇళ్ల వద్దకు స్వయంగా వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ సజ్జలదిన్నె రాజు, మండల కన్వీనర్ పల్లె నాగేశ్వరరెడ్డి, శివారెడ్డి, లోకనాథరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ఓబుల రెడ్డి, పెద్దిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నె: మండల పరిధిలోని కల్లూరు పంచాయతీ గ్రామ సచివాలయం-2 పరిధిలో వలంటీర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ప్రభాకర్ ఇటీవల గుండె పోటుతో మృతి చెందాడు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.5 లక్షల ఆర్థికసాయాన్ని సోమవారం ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి తన క్యాంపు కార్యాలయంలో వలంటీర్ తల్లి నాగేశ్వరమ్మకు అందజేశారు.

శింగనమల: పేదల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సీఎం రిలీఫ్ ఫండ్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి కోరారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గంలోని 19 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ.27.06 లక్షల విలువైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.

సంక్షిప్త సమాచారం

అనారోగ్యంతో ఉపాధ్యాయురాలి మృతి

గుత్తి: పట్టణంలోని కోట వీధిలో నివాసం ఉంటున్న ఉపాధ్యాయురాలు కృష్ణవేణి ఆదివారం అర్ధరాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. కృష్ణవేణి కొజ్జేపల్లి యూపీ పాఠశాలలో సోషల్ స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తించేవారు. అయితే కొన్ని రోజుల క్రితం అనారోగ్యానికి గురయ్యారు. ఆదివారం రాత్రి ఆరోగ్యం పూర్తిగా క్షీణించడంతో మృతి చెందారు. కృష్ణవేణి మృతిపై వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శ్రీనివాసరెడ్డి, పట్టణ కన్వీనర్ పీరా, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు సంతాపం ప్రకటించారు.

నేడు ప్రత్యేక విద్యుత్ అదాలత్

తాడిపత్రి అర్బన్/గుత్తి: విద్యుత్ వినియోగదారుల సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించేందుకు మంగళవారం గుత్తిలోని ఈఈ కార్యాలయంలో ప్రత్యేక విద్యుత్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏడీ రఘు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకూ నిర్వహించే ఈ అదాలత్‌లో ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థకు చెందిన అధికారులు చైర్మన్ శ్రీనివాస ఆంజనేయమూర్తి, ఆర్థిక సభ్యుడు రామమోహన్‌రావు, సాంకేతిక సభ్యుడు అంజనీకుమార్, స్వతంత్ర సభ్యురాలు ఈశ్వరమ్మ పాల్గొంటారన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని నంద్యాల రోడ్డులో అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ హమీద్‌ఖాన్ తెలిపారు. మద్యం విక్రయిస్తున్న కల్లూరు ఖాజామోదీన్ అలియాస్ దాదు, షేక్ మస్తాన్‌వలి, సలీం, హనీఫ్ అనే ముగ్గురుని అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. వారి నుంచి రూ.21,700 విలువ చేసే 432 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నీటి సమస్య తలెత్తనీయొద్దు

గుంతకల్లుటౌన్: పట్టణంలోని దోనిముక్కల రోడ్డు ఇందిరమ్మ, జగనన్న కాలనీల్లోని ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున ఇంజినీర్లకు సూచించారు. సోమవారం ఆయన దోనిముక్కల రోడ్డులోని ఈఎల్ఎస్ఆర్ ట్యాంకును పరిశీలించారు. ట్యాంకు నుంచి ఆయా కాలనీవాసులకు నీటి సరఫరా చేయడానికి 8 ఇంచుల పైప్‌లైన్ ఏర్పాటు చేయాలన్నారు. ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాను తగ్గించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అంతకుముందు ఆయన పాత ఎస్ఎస్.ట్యాంకు ఫిల్టర్‌బెడ్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈ గురప్పయాదవ్, డీఈలు రామ్మూర్తి, సుమలత, ఏఈ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కుల చైతన్య ఫోరం అధ్యక్షుడిగా రాంబాబు

తాడిపత్రి అర్బన్: అభ్యుదయ మానవ హక్కుల చైతన్య ఫోరం రాయలసీమ అధ్యక్షుడిగా రాంబాబు ఎన్నికయ్యారు. సోమవారం పట్టణంలోని కార్యాలయంలో అభ్యుదయ హ్యూమన్ రైట్స్ జాతీయ చైర్మన్ సగబాల రామాంజినమ్మ ఆధ్వర్యంలో కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా బి.అమర్నాథ్, జాయింట్ సెక్రెటరీలుగా మోహన్, నందినీలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ జిల్లా చైర్‌పర్సన్ జి.రోజానాయుడు, హ్యూమన్ రైట్స్ సభ్యులు పాల్గొన్నారు.

సెల్ టవర్ నిర్మించొద్దని వినతి

గుత్తి రూరల్: మునిసిపాలిటీ పరిధిలోని చెట్నేపల్లి వంకగడ్డ వీధిలో సెల్ టవర్ నిర్మాణం చేపట్టరాదని కాలనీ వాసులు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ మహబూబ్ బాషాకు వినతిపత్రం అందజేశారు. కాలనీలోని నారాయణ అనే వ్యక్తికి చెందిన ఖాళీ స్థలంలో ఓ ప్రముఖ కంపెనీ సెల్ టవర్ నిర్మాణ పనులు ప్రారంభించారన్నారు. నిర్మాణాలను అడ్డుకుని పనులు నిలిపి వేయించామన్నారు.

కృష్ణా జలాల గెజిట్ నోటిఫికేషన్ రద్దు చేయాలి



మాట్లాడుతున్న జగదీష్

గుంతకల్లు: కృష్ణ జలాలను పంపిణీ చేసే గెజిట్ నోటిఫికేషన్‌ను తక్షణమే రద్దు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో అఖిల పక్ష పార్టీల రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈ గెజిట్ ద్వారా రాయలసీమ జిల్లాలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆరోపించారు. ఇప్పటికే కృష్ణా జలాల పంపిణీపై బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పు ఇచ్చిందన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో అఫిడవిట్ వేసి.. స్టే తీసుకురావడం జరిగిందని గుర్తు చేశారు. అలాంటప్పుడు గెజిట్ నోటిఫికేషన్ ఏ విధంగా ఇస్తారని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రస్తుతం తెలంగాణలో ఎన్నికలు జరుగుతున్న దృష్ట్యా బీజేపీ, కేసీఆర్‌లు రాజీపడి ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. నోటిఫికేషన్ రద్దుకు కృషి చేయాలని అన్ని పార్టీలను కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దౌల్తాపురం ప్రభాకర్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బి.గోవిందు, సీపీఐ పట్టణ, మండల కార్యదర్శులు గోపీనాథ్, రాము తదితరులు పాల్గొన్నారు.

యల్లనూరు ఎస్‌ఐగా విజయ్ భాస్కర్

యల్లనూరు: యల్లనూరు ఎస్‌ఐగా విజయ్ భాస్కర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం వీఆర్‌లో ఉన్న ఈయన ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా నూతన ఎస్‌ఐ మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరిస్తామన్నారు.

రక్తదాన శిబిరం



ఎస్ఆర్ఐటీలో రక్తదానం చేస్తున్న దాతలు

బుక్కరాయసముద్రం: రక్తదానంతో మరొకరి ప్రాణాలను కాపాడొచ్చని ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ పేర్కొన్నారు. సోమవారం రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో మానవతా రక్తదాతల సంస్థ, హెడీఎఫ్‌సీ బ్యాంక్ అనుబంధంగా ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 125 యూనిట్ల బ్లడ్ సేకరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులు, డీన్ సాయి కిషోర్ చైతన్య టీపీఓ రంజిత్‌రెడ్డి, మానవతా సంస్థ కన్వీనర్ అమర్‌నాథ్‌రెడ్డి, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మేనేజర్ అరవింద్, ఎన్ఎస్ఎస్ పీఓ, రాష్ట్రపతి అవార్డు గ్రహీత చిన్న పుల్లయ్య పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

పెద్దవడుగూరు: మండల పరిధిలోని చిత్రచేడు గ్రామానికి చెందిన శ్రీనివాసులు అనే యువకుడి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం శ్రీనివాసులును తల్లి మందలించడంతో అతడు ఇంటి నుంచి వెళ్లిపోయాడని పేర్కొన్నారు. బంధువులు, తోటి మిత్రులను విచారించినా ఆచూకీ లభ్యం కాలేదు. యువకుడి తండ్రి రామాంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఆచూకీ తెలిసిన వారు 9440796826 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

నేడు ప్రజాభిప్రాయ సేకరణ

యాడికి: చందన రెవెన్యూ గ్రామంలోని ఉన్నత పాఠశాలలో మంగళవారం న్యూ వెంకటేశ్వర మినరల్స్ మైన్స్‌పై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ బాలమ్మ సోమవారం ప్రకటనలో తెలిపారు. చందన గ్రామం సర్వే నంబర్ 728లో 16,027 హెక్టార్లలో మైన్స్ తవ్వుకునేందుకు కర్నూలుకు చెందిన సితార చిరంజీవికి అనుమతులు మంజూరైనట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి అనంతపురం డీఆర్వో గాయత్రి హాజరవుతారన్నారు. అలాగే పంచాయతీలోని గ్రామపెద్దలు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

ఆటో బోల్తా: ఇద్దరికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని కొత్తపేట గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై సోమవారం ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నంద్యాల జిల్లా నందికొట్కూరుకు చెందిన అమ్ము, ముత్తు కుటుంబ సభ్యులతో కలసి పామిడికి ఆటోలో బయలుదేరారు. అయితే కొత్తపేట గ్రామ శివారుకు చేరుకోగానే వేగంగా వెళ్తున్న ఆటోకు కుక్క అడ్డుగా రావడంతో డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేశాడు. దీంతో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో అమ్ము, ముత్తు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్సలకు కర్నూలు తరలించారు.

త్వరలో ఆదర్శ పాఠశాలకు హద్దుల ఏర్పాటు

యాడికి: ఆదర్శ పాఠశాల స్థలం కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలని హెచ్ఎం మారుతి కోరారు. సోమవారం స్పందన కార్యక్రమంలో తహసీల్దార్ బాలమ్మకు వినతిపత్రం అందజేశారు. ఆదర్శ పాఠశాల వెనుక భాగంలో తమ స్థలం ఉందంటూ ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆదివారం సాయంత్రం స్కూల్ సంపు, బోరుబావిపై మట్టి తోలి రస్తా నిర్మిస్తున్నారని తెలిపారు. అనంతరం తహసీల్దార్ బాలమ్మ కబ్జాకు గురైన స్థలాన్ని పరిశీలించారు. త్వరలో ఆదర్శ పాఠశాలకు హద్దులు ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. రియల్ ఎస్టేట్ వ్యాపారికి నోటీసులు జారీ చేయాలని మండల సర్వేయర్ సుంకన్నకు సూచించారు.

విద్యార్థి అదృశ్యం



అజయ్‌కుమార్

యాడికి: మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న విద్యార్థి అదృశ్యమయ్యాడు. ఎస్‌ఐ గురు ప్రసాద్ రెడ్డి తెలిపిన వివరాలు.. మండల కేంద్రంలో అంబేడ్కర్ నగర్‌కు చెందిన సూర్యనారాయణ కుమారుడు అజయ్‌కుమార్ (14) ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నాడు. సోమవారం ఉదయం పాఠశాలకు వెళ్లకుండా సైకిల్ తొక్కుకుంటూ బయటకు వెళ్లిన విద్యార్థి ఇంటికి తిరిగి రాలేదు. తండ్రి సూర్యనారాయణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
తాడిపత్రి డివిజన్
9912220722, 9010223701
9912220732, 9010588846